క్లుప్తంగా

నిరుపేద విద్యార్థికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ధర్మారం: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి సౌమ్యకు బుధవారం కొలుముల దామోదర్‌యాదవ్ ట్రస్టు సభ్యులు బుధవారం రూ.25వేలు అందించారు. కొత్తూరు గ్రామానికి చెందిన తమ్మడవేని లక్ష్మీనర్సయ్య కూతురు సౌమ్యకు పీసెట్‌లో 22వ ర్యాంకు వచ్చింది. ఉస్మానియా యూనివర్సిటీలో సీటు వచ్చింది. ట్రస్టు సభ్యుల ద్వారా సౌమ్య ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఎన్‌ఆర్‌ఐ దామోదర్‌యాదవ్ ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్టు సభ్యులు వేల్పుల నగరాజు, లింగమూర్తి, జెల్ల సంపత్, తమ్మడవేని అంజి, నందాల మల్లేశం, మారం రాజయ్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



అభినందిస్తున్న కరస్పాండెంట్

సుల్తానాబాద్: క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ఇండియన్ పబ్లిక్ పాఠశాల కరస్పాండెంట్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అన్నారు. మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో మంగళవారం జరిగిన జోనల్ స్థాయి క్రీడల్లో నాలుగు మండలాలు పాల్గొనగా సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి సత్తా చాటారు. వీరిని కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, ఇక్బాల్, శివ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సుల్తానాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రఘునాథ్ అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయిలో శ్రీనిధి, అజయ్, సాయిచరణ్ చత్తాచాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కాగా బుధవారం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. సీనియర్ పీజీటీ బిక్షం, పీఈడీ వెంకటక్మి ఉన్నారు.

బీఎల్వోలకు ఓటరు తుది జాబితా

ఓదెల: మండలంలోని బీఎల్వోలకు ఓటరు తుది జాబితాను ఆర్‌ఐ బండ రాజేందర్ బుధవారం అందజేశారు. మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, ఉపసర్పంచు తీర్థాల కుమార్, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

'శ్రీధర్‌బాబును విమర్శిస్తే సహించేది లేదు'

రామగిరి: మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబును పుట్ట మధు విమర్శిస్తే సహించేది లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్, మండల అధ్యక్షుడు తోట చంద్రయ్య అన్నారు. మంగళవారం సెంటినరీకాలనీ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్న పుట్ట మధుకు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్తాతారన్నారు. టౌన్ అధ్యక్షుడు కాటం సత్యం, ఎంపీటీసీలు చిందం మహేశ్, కొప్పుల గణపతి, కొట్టె సందీప్, నాయకులు బర్ల శ్రీనివాస్, ముస్త్యాల శ్రీనివాస్, మంథని రవీందర్, ఉడుత శంకర్, కండె పోచం, నరేశ్, రాజ్‌కుమార్, మర్రి ఓదెలు పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌ను విస్మరించిన అధికారులు

ధర్మారం: మండల కేంద్రంలో రూ.14.20కోట్లతో నిర్మించనున్న రోడ్డు విస్తరణ సెంట్రల్ లైటింగ్ పనులను బుధవారం మంత్రి కొప్పుల ఈశ్వర్ శంకుస్థాపన చేశారు. ఇందుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు తయారు చేయించారు. మంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన తర్వాత గమనించగా సర్పంచ్ పుస్కూరి జితేందర్‌రావు పేరు శిలాఫలకంపై లేదు. అయినప్పటికీ అధికారుల తప్పిదంగా భావించి మిగతా కార్యక్రమంలో పాల్గొన్నారు. శిలాఫకంపై సర్పంచ్ పేరు లేకపోవడన్ని మండలంలోని సర్పంచులు ఆర్‌అండ్‌బీ అధికారుల పనితీరును తప్పుపట్టారు. మండలంలోని బొమ్మారెడ్డిపల్లిలో సైతం ఆర్‌అండ్‌బీ అధికారులు శిలాఫకంపై సర్పంచు పేరును తప్పుగా నమోదు చేయడంపై ఆ సర్పంచ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పిదాలు జరుగుతున్నప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారుల్లో మార్పురావడం లేదని సర్పంచులు ఆరోపించారు.

ఐకేపీ కార్యాలయానికి దారేది?

- పొలం బాటలో నడుస్తూ అధికారులు, స్వశక్తి మహిళల అవస్థలు
- ఐదేళ్లుగా ఇదే పరిస్థితి
- రోడ్డు నిర్మించాలని డిమాండ్



పొలంబాటలో కార్యాలయానికి వెళ్తున్న స్వశక్తి మహిళలు (ఫైల్)

ముత్తారం: అద్దె భవనం కష్టాలు తొలగి సొంత భవనంలోకి వెళ్లామనే సంబరం మహిళలో నిరాశే మిగిల్చింది. ముత్తారంలోని ఐకేపీ కార్యాలయానికి వెళ్లడానికి పొలంబాటే దారి కావడంతో మహిళలు అవస్థలు పడుతున్నారు. రుద్రమ మహిళా మండల సమాఖ్య భవనం నిర్మాణానికి, ప్రారంభానికి పాలకులు మారినా కార్యాలయానికి వెళ్లే దారి పరిస్థితి మారలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. వానాకాలంలో బురద, వేసవి, చలికాలంలో దారి పూర్తిగా గడ్డి, పిచ్చి మొక్కల చిత్తడితో పాములు, క్రిమికీటకాల భయంతో కార్యాలయానికి వెళ్లడానికే మహిళలు జంకుతున్నారు. పొలం బాట దారిగుండా వాహనాలు వెళ్లలేని పరిస్థితిలో అధ్వానంగా ఉండటంతో జిల్లా ఉన్నత అధికారులు, పాలకులు అటు వైపు కన్నెత్తి చూపిన దాఖలాలు లేవు.

ఐదేళ్లుగా అవస్థలు..

ఐకేపీ భవన నిర్మాణానికి 2013 ఏప్రిల్ 6న అప్పటి ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఉపాధిహామీ పథకం కింద మంజూరైన రూ.25లక్షలతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మరో రూ.7లక్షలు పెంచి నిర్మాణం పూర్తి చేయడానికి ఐదేళ్లు పట్టింది. 2018 సెప్టెంబరు 6న అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత జెడ్పీచైర్మన్ పుట్ట మధూకర్ హయాంలో భవన నిర్మాణం ప్రారంభించారు. భవనం నిర్మించి ఐదేళ్లయినా ఇప్పటికీ రోడ్డు వేయలేదు. నూతన ఐకేపీ రుద్రమ మహిళా మండల సమాఖ్య భవనానికి వెళ్లడానికి అధికారులు, స్వశక్తి సంఘం మహిళలు ఇబ్బంది పడుతున్నారు. పొలం బాట దారిన బురద, క్రిమికీటకాల భయంతో బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వానాకాలంలో బురదలో పడుతూ, మిగతా కాలంలో పాములు కనిపించడంతో పరుగెత్తిన ఘటనలు ఉన్నాయి. కార్యాలయ పని నిమిత్తం సాయంత్రం చీకటైతే సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ సాయంతో ఐకేపీ అధికారులు తమ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని వెళ్తారు. మంథని–ముత్తారం ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఐకేపీ కార్యాలయానికి సుమారు 300 మీటర్ల దూరం ఉంటుంది. రోడ్డు నిర్మాణం గురించి పట్టించుకునే వారు కరువయ్యారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు వేయాలి



కార్యాలయానికి వెళ్లే దారి పూర్తిగా గడ్డి, పిచ్చి మొక్కలతో చిత్తడిగా ఉంది. చాలా సార్లు నాకు, మా సిబ్బందికి, స్వశక్తి మహిళలకు పాములు కనిపించాయి. ప్రస్తుతం ఉన్న దారిని చదును చేసి మొరం పోయాలి. రోడ్డు వేసి శాశ్వత పరిష్కారం చూపాలి. – దొమ్మటి పద్మ, ఐకేపీ ఏపీఎం

మీటింగ్‌లకు రావడం లేదు



దారి బాగాలేదని, పాముల బెడదతో కార్యాలయంలో జరిగే సమావేశాలకు స్వశక్తి మహిళలు రావడం లేదు. ఇటీవల జరిగిన మండల సమావేశానికి ఆ బురద దారిలో ఓ మహిళ పడిపోయింది. పాలకులు మారినా రోడ్డు వేయడం లేదు. రోడ్డు వేసి మా కష్టాలు తీర్చాలి. – గుర్రాల మహేశ్వరి, రుద్రమ మండల సమాఖ్య అధ్యక్షురాలు

అరచేతిలో ప్రాణాలు



రోజూ ఆఫీస్‌కు వెళ్లి వచ్చే క్రమంలో దారి పొడవునా చిత్తడి ఉండటంతో మా ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి. పని నిమిత్తం కొద్దిగా ఆలస్యమైతే బిక్కుబిక్కుమంటూ సెల్‌ఫోన్ టార్చ్ లైట్‌తో వస్తాం. చుట్టూ పొలాలు ఉండటంతో కార్యాలయంలోకి పాములు వచ్చిన ఘటనలు ఉన్నాయి. – కట్ల కవిత, ఐకేపీ అకౌంటెంట్

డంపింగ్ యార్డును తరలించాలి



చెత్తకుప్పలను పరిశీలిస్తున్న నాయకులు

కోల్‌సిటీ: గోదావరి ఒడ్డున పేరుకుపోతున్న డంపింగ్ యార్డును మరోచోటికి తరలించకపోతే ఆందోళన చేస్తామని సీపీఐ నాయకులు అన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గోదావరి తీరాన పారిశుద్ధ్య కార్మికులు చెత్తను కుప్పలుగా పోస్తున్న తీరును, బుధవారం సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజు పరిశీలించారు. రూ.వందల కోట్ల నిధులతో రామగుండం ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్తున్న పాలకులు, అధికారులు, డంపింగ్ యార్డును ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. కుప్పలుగా పోసిన చెత్తను కాల్చి సమీప కాలనీల ప్రజలకు కాలుష్యాన్ని వ్యాపింపజేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి తాళ్లపెల్లి మల్లయ్య, కార్యవర్గ సభ్యులు శనిగరపు చంద్రశేఖర్, మార్కాపురి సూర్య, రేణికుంట్ల ప్రీతమ్, ఆసాల నవీన్ పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం నియోజకవర్గంలో మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని పాదయాత్ర ఇన్‌చార్జి ఎండీ ముస్తఫా, బీసీ సెల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రమేశ్ పిలుపునిచ్చారు. బుధవారం యైటింక్లయిన్‌కాలనీ తెలంగాణ చౌరస్తా సమీపంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాదయాత్ర ఈనెల 6 నుంచి 17వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. అన్నివర్గాల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, చక్రపాణి, తిరుపతిరెడ్డి, సారయ్యనాయక్, రాజు, అరుణ్‌కుమార్, అనిత, కేతమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ పంచాయతీ కార్యదర్శి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడని ఎంపీటీసీ మిట్టపల్లి వసంత, నాయకుడు వెంకటేశం ఎంపీడీవోకు బుధవారం ఫిర్యాదు చేశారు. కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పంచాయతీ రికార్డులను పరిశీలించి లావాదేవీలపై విచారణ జరిపితే అక్రమాలు వెలుగులోకి వస్తాయన్నారు. గ్రామానికి వచ్చిన బతుకమ్మ చీరలను పంపిణీ చేసేందుకు కేవలం సర్పంచ్‌నే ఆహ్వానించి తనను అవమానించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని, ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

✦ ఉచిత పశువైద్య శిబిరం

జూలపల్లి: రైతులు పాడి పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు ఉచిత వైద్య శిబిరాల్లో పరీక్షలు చేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అజారుద్దీన్ సూచించారు. మండలంలోని నాగులపల్లెలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో పశువుల్లో గర్భకోశ వ్యాధులు, చూడి నిర్ధారణ, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.

✦ బతుకమ్మ చీరల పంపిణీ

పెద్దపల్లిరూరల్: మండలంలోని గౌరెడ్డిపేట, అప్పన్నపేటలో ఎంపీపీ స్రవంతి, సర్పంచ్‌లు శ్రీనివాస్, స్వరూప బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు.

✦ విద్యా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బుధవారం టాస్క్ ఆధ్వర్యంలో విద్యానైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. కాలేజ్ ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య, టాస్క్ కోఆర్డినేటర్ తిరుపతి నైపుణ్యాలపై అవగాహన కల్పించారు.

✦ కోరుకంటి చందర్ విజయం సాధించాలని పూజలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలవాలని బుధవారం యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పీఏసీఎస్ చైర్మన్ మామిడాల ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైస్ చైర్మన్ ధరణి పోచం, మాజీ సర్పంచ్ అర్చనపల్లి శ్రీనివాస్, డైరెక్టర్ తాటికొండ రాజబాబు, వెంగళరావు, సతీశ్, కళావతి, రమణారెడ్డి, శంకర్, పరశురాం పాల్గొన్నారు.

✦ బీజేపీ మండల కమిటీలు రద్దు

గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని బీజేపీ 8 మండల కమిటీలను రద్దు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ తెలిపారు. రాష్ట్ర కమిటీ ఆమోదం లేనందున కమిటీలను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో మున్సిపల్ ఏరియా కమిటీలను నియమిస్తామని పేర్కొన్నారు.

✦ నేడు రౌండ్ టేబుల్ సమావేశం

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని మార్కండేయకాలనీలోని రాజ్యలక్ష్మీ గార్డెన్‌లో గురువారం పెద్దపల్లి పార్లమెంట్ స్థాయి మాదిగ కుల బాంధవుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు.

✦ నేడు సింగిల్‌విండో గోదాం ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో గురువారం సింగిల్‌విండో గోదాంను పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, ఆప్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు ప్రారంభించనునట్లు సింగిల్‌విండో చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి తెలిపారు. రూ.38లక్షల నాబార్డు నిధులతో గోదాం నిర్మించారు.

✦ పలువార్డుల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని పలువార్డుల్లో బుధవారం అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో పట్టణాన్ని సుందరంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కమిషనర్ ఆకుల వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

✦ ఇంటింటా కాంగ్రెస్ ప్రచారం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ, టీటీఎస్ అంతర్గాం గ్రామాల్లో బుధవారం డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు ఇంటింటా కాంగ్రెస్ గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రతినిధులు హన్మాన్‌రెడ్డి, రాజేందర్, గోపాల్‌యాదవ్, నాగరాజు, విజయ్, స్వామి, రాజ్‌కుమార్, కాంపెల్లి సంతోష్, ఆలకుంట సంజీవ్, రాజేశ్ ఉన్నారు.

✦ సురభి శ్రీధర్‌కు భారత్ ఐకాన్ అవార్డు

గోదావరిఖనిటౌన్: వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు సురభి శ్రీధర్ చేస్తున్న సేవలను గుర్తించి మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో ఇంటర్నేషనల్ హానరీ–2023 భారత్ ఐకాన్ అవార్డును స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా చైర్మన్ ఆకుల రమేశ్ చేతుల మీదుగా శ్రీధర్ అందుకున్నారు.

బహుజనులు ఏకం కావాలి



దాసరి ఉషతో బీఎస్పీ నాయకులు

పెద్దపల్లిరూరల్: బహుజనులంతా ఏకమై వచ్చే సాధారణ ఎన్నికల్లో బహుజన రాజ్యాధికారం సాధించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పెద్దపల్లి నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష అన్నారు. పార్టీ పెద్దపల్లి అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీ నాయకులు పలువురు కులసంఘాల ప్రతినిధులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు అఖిల, కొమురయ్య, లక్ష్మణ్, మల్లేశం, శ్రీనివాస్, మహేశ్, మహేందర్, రాజిరెడ్డి, రాజేశం, సంపత్ ఉన్నారు.

టీచర్‌కు సన్మానం



సన్మానిస్తున్న ఎంపీపీ, ఉపాధ్యాయులు

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం నలుమాసు సుదర్శనం బదిలీ కాగా బుధవారం వీడ్కోలు సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ స్రవంతి సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, సన్మానించారు. సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పీఎం.షేక్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ఎంఈవో కవిత, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అప్పిగి సంతోష్‌రెడ్డి, టీఎస్‌జీహెచ్‌ఎంఏ అసోసియేట్ అధ్యక్షుడు నలుమాసు హరిప్రసాద్, భరోసా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఆకెనపల్లి నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో వసతులు మెరుగుపర్చాలి

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రిలో వసతులు మెరుగుపరిచి రోగులకు సరైన చికిత్స అందించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో సతమతమవుతున్నారని, ఆసుపత్రిలో వసతులు మెరుగుపర్చాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు బాజీపటేల్, అశోక్, మునీర్, సతీశ్, దేవేందర్, రమేశ్, జబ్బని రాజమల్లు, క్రాంతి, మొండయ్య, శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి



పోలీసుల అదుపులో అంగన్‌వాడీ టీచర్లు

కాల్వశ్రీరాంపూర్: తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు 'చలో హైదరాబాద్ అంగన్‌వాడీ కార్యకర్తల అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్నారన్న సమాచారం మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలను కాల్వశ్రీరాంపూర్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, అన్ని రాయితీలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాజమణి, రజిత, సుజాత, సుమలత, శ్రావణి, దేవేంద్ర, మాధవి, మంజుల ఉన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్: మహిళల సంక్షేమానికి ప్రభుత్వ పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సార్ గార్డెన్‌లో బుధవారం మండల మహిళా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి రుణాలు ఇస్తోందన్నారు. ఎంపీపీ బాలాజీరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు లావణ్య, ఎంపీటీసీలు అనిత, అనూష ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఫకీర్, మండల ఫోరం అధ్యక్షులు వీరగోని సుజాత, సొసైటీ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి క్రీడాకారులకు క్రీడా సామగ్రి, టీ షర్టులు అందజేశారు. ఎంపీడీవో శశికళ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ప్రజా ప్రతినిధులు బాపురెడ్డి, విజేందర్, పెద్దన్న, అనిత, శ్రీనివాస్, రాజమల్లు చంద్రమౌళి, రాజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ప్రేంచందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, ముత్యం రమేశ్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్లు జూపల్లి సందీప్‌రావు, కౌన్సిలర్లు గోపి, తిరుపతి, గుర్రాల శ్రీనివాస్, సంపత్, బాపూరావు, ఆంజనేయులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి

సుల్తానాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే పల్లె, పట్టణ సమగ్ర అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల, చిన్నబొంకూర్ గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌లు రమేశ్‌గౌడ్, రాజు, ఎంపీపీ బాలాజీరావు, మున్సిపల్ చైర్పర్సన్ ముత్యం సునీత, పార్టీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌చందర్‌రావు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇంకెప్పుడిస్తరు?



ఆర్డీవో ఆఫీసుకు వెళ్తున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పేదలందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. పెద్దపల్లిలో బుధవారం మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్యతో కలిసి ఆర్డీవో ఆఫీసు వరకు ఆయన ప్రదర్శనగా వెళ్లారు. ఆర్డీవో మధుమోహన్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు అందించి పేదలకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదలకు రూ.5లక్షలు ఇంటినిర్మాణం కోసం ఇస్తుందని భరోసా ఇచ్చారు. నాయకులు బి.సురేశ్‌గౌడ్, ప్రకాశ్‌రావు, మహేందర్, మల్లయ్య, సంపత్, రాజేశ్వర్‌రెడ్డి, సుభాష్‌రావు, గంట రమేశ్, విజయేందర్‌రెడ్డి, సదయ్య, రాజు, విజయ్, తిరుపతిరావు ఉన్నారు.

ఆడబిడ్డలకు అండగా సీఎం కేసీఆర్



ముత్తారం: చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

సుల్తానాబాద్‌రూరల్: ఆడబిడ్డలకు అండగా సీఎం కేసీఆర్ నిలుస్తున్నారని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల, గర్రెపల్లి, బొంతకుంటపల్లి గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీని ప్రారంభించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు సుజాత, ఉన్నారు.

పాలకుర్తి: మండలంలోని కన్నాలలో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. మండల పంచాయతీ అధికారి షబ్బీర్‌పాషా, కార్యదర్శి రవి, కన్నాల సింగిల్‌విండో వైస్‌చైర్మన్ కుడిక్యాల సురేశ్, ఎంపీటీసీ అతిక్, ఉపసర్పంచ్ పుట్ట రంజిత్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మహిళకు ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ జాహెద్‌పాషా, వైస్ ఎంపీపీ శిరీష చీరలు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజకొమురయ్య పాల్గొన్నారు.

ఓదెల: మండలంలో బతుకమ్మ చీరలను ఎంపీపీ కునారపు రేణుకదేవి పంపిణీ చేశారు. సర్పంచులు సామ మణెమ్మ, ఆకుల ఉదయదేవి, పెద్దపల్లి మార్కెట్ వైస్‌చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, కార్యదర్శి భానుప్రసాద్, రైతుసమన్వయ సమితి డైరెక్టర్ బండారి ఐలయ్యయాదవ్, ఉపసర్పంచు పాకాల సంపత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఢిల్లి శంకర్ పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని పంచాయతీలో మహిళలకు బతుకమ్మ చీరలను ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి పంపిణీ చేశారు.

ముత్తారం: ముత్తారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్ ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి పంపిణీ చేశారు. ఎంపీవో వేణుమాధవ్, సర్పంచుల ఫోరం మండల కన్వీనర్ కుమార్, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం సుందిళ్ల, ముస్త్యాల గ్రామాల్లో చీరలు పంపిణీ చేశారు.

బియ్యం తక్కువగా వస్తున్నాయని రేషన్ డీలర్ల ఆందోళన



బస్తాలు చినిగి లారీల్లో కిందపోయిన బియ్యం

సుల్తానాబాద్: మండల కేంద్రంలో ఉన్న గోదాం నుంచి బుధవారం వివిధ గ్రామాలకు చౌకధరల దుకాణాలకు బియ్యం సరఫరా చేపట్టారు. వివిధ గోదాముల నుంచి వచ్చిన బియ్యాన్ని గోదాములో హమాలీల ద్వారా బరువు జోకిన తర్వాతే గోదాములో దించుకోవాలి. కానీవ గోదాముల నుంచి వచ్చిన లారీలను నేరుగా చౌక ధరల దుకాణాలకు పంపుతున్నట్లు డీలర్లు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రతి డీలర్‌కు 2 నుంచి 3 క్వింటాళ్ల వరకు తక్కువగా వస్తున్నట్లు వారు వాపోతున్నారు. గోదాం అధికారి మహేశ్ అందుబాటులో ఉన్నప్పుడు అడిగితే ఉన్నతాధికారులను అడగాలని తనకు సంబంధం లేదని చెప్పుకొచ్చారు. సివిల్ సప్లై డీఎం ప్రేమ్‌కుమార్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని, ఫిర్యాదులు అందితే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గోదాంలో విచారణ..

సుల్తానాబాద్ సివిల్ సప్లై గోదాంలో సివిల్ సప్లై డీఎం ప్రేమ్‌కుమార్ ఎఫ్‌ఐ శంకర్‌తోపాటు పలువురు అధికారులు తనిఖీ చేశారు. డీలర్ల ఫిర్యాదుతో తనిఖీ చేశారని పలువురు తెలిపారు. చౌకధరల దుకాణాలకు వస్తున్న బియ్యంతో పాటు మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడీ కేంద్రాలు, పట్టుబడిన బియ్యం నిల్వలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా విచారణ జరుగుతున్న సమాచారాన్ని రహస్యంగా ఉంచారు.

క్రైం న్యూస్

✦ చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని బన్నె చెరువులో ఈతకు వెళ్లి గల్లంతైన ఆకుల భవాని శంకర్ మృతదేహం బుధవారం లభ్యమైంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వెతకగా శంకర్ మృతదేహం బయటపడింది. కాగా జెడ్పీచైర్మన్ పుట్ట మధు పోస్టుమార్టం వద్ద మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

✦ రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముత్తారం: ముత్తారం ఎస్సీకాలనీ మంథని–ఓడేడ్ ప్రధాన రోడ్డుపై బుధవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని అడవిశ్రీరాంపూర్‌కు చెందిన కందికట్ల మధూకర్ ముత్తారం నుంచి తమ గ్రామానికి వస్తుండగా, ముత్తారానికి చెందిన సిద్ద రాజు కాసార్లగడ్డకు వెళ్తుండగా ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మధూకర్ తలకు తీవ్ర గాయాలు కాగా ముత్తారం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. స్వల్ప గాయాలైన రాజు స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించుకున్నారు. ప్రమాద స్థలాన్ని కానిస్టేబుల్ అశోక్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

✦ ప్రమాదవశాత్తు జారిపడి కూలీ మృతి

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని మందాట వీధిలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద పనులు చేస్తుండగా గోవా కర్ర నుంచి జారిపడి చిప్ప శేఖర్ (52) మృతి చెందాడు. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన శేఖర్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం నిర్మాణంలో ఉన్న భవనంపై గోవా కర్రపై ఉండి పని చేస్తుండగా జారడంతో కిందపడి తలకు బలమైన గాయమైంది. వైద్యం కోసం స్థానిక హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.